

14 కిలోల మారవ

సదుం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి):సదుం మండలంలోని తిమ్మానాయనిపల్లె పంచాయతీ కొర్లకుంటవారిపల్లె ప్రాజెక్టు నుంచి వచ్చే గార్గేయ నది నీటిలో సుమారు 14 కిలోల మారవ చేప వలకు చిక్కింది.భార్గవ్ అనే యువకుడు శనివారం వేసిన వలకు సుమారు మూడడుగుల పొడవున్న మారవ చిక్కుకోవడంతో ఉబ్బితబ్బిబ్బైపోయాడు.ఈ చేపను చూసేందుకు చిన్నారులు ఎగబడ్డారు.

రారాజును చూద్దాం రారండి



6లో

శ్రీవారి ఆలయం వద్ద సీపీఐ నారాయణ



తిరుమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణ శనివారం తిరుమల శ్రీవారి ఆలయం ముందు కొద్ది సమయం గడిపారు.భక్తులను ఆప్యాయంగా పలకరించారు. దర్శనానంతరం ఆలయం నుంచి వెలుపలకు వచ్చిన మాజీ మంత్రి రోజాను చూసి పలకరించారు.పక్కనే ఉన్న కుటుంబ సభ్యులతో ఫొటో దిగారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు 35 ఏళ్లుగా సీపీఐ కార్యాలయంలో సెక్రటరీగా పనిచేసిన గోవిందు కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. 'గుడికి పోలేదు. ఇలా వస్తే గుడికి పోనీయరు కదా' అంటూ తన దుస్తులను చూపుతూ నవ్వారు.శ్రీవారి దర్శనానికి భక్తులు బాగానే వస్తున్నారని, ఆదాయం, సౌకర్యాలు బాగున్నాయన్నారు.

పంట నష్టం లెక్కలు కడుతున్నారు



పుంగనూరు మండలం చదళ్ల గ్రామ సమీపంలో నీట మునిగిన కాలీఫ్లవర్ పంట

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా సంభవించిన పంట నష్టం అంచనాలను జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు లెక్కలు కడుతున్నారు.యాదమరి, గుడిపాల, బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు, వి.కోట, చౌడేపల్లె మండలాల్లో టమోటాతో పాటు కూరగాయ పంటలు దెబ్బతినే అవకాశమున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు గుర్తించారు. కాగా, ఈ ఏడాది సాధారణ పంటలు ఎక్కువగా సాగు కాకపోవడంతో పంట నష్టాలు తక్కువగానే వుంటాయని వ్యవసాయశాఖ అధికారులు భావిస్తున్నారు. వర్షాధార పంట వేరుశనగతో పాటు వరికి ఎక్కువ నష్టం కలిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా కార్డన్ సెర్చ్



ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల భద్రత, రక్షణ ప్రధాన లక్ష్యంగా శనివారం జిల్లావ్యాప్తంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎస్పీ రాజశేఖర రాజు ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనుమానాస్పద వ్యక్తులపై తనిఖీలు, వాహనాల పరిశీలన, నేరస్థుల కదలికలపై ఆరా తీశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో 11 ద్విచక్ర వాహనాలు, 30 ఎన్‌డీపీఎల్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ నేరాలను ముందస్తుగా అరికట్టి ప్రజల్లో భద్రతా వాతావరణాన్ని బలపరచడం, ప్రతి ప్రాంతంలో పోలీసుల సాన్నిహిత్యం స్పష్టంగా కనిపించేలా పనిచేయడం ద్వారా అసాంఘిక కార్యకలాపాలను నిరోధించిన వారవుతామన్నారు. మీ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

రేపు పులిచెర్లలో పీజీఆర్ఎస్

● హాజరుకానున్న కలెక్టర్, జిల్లాస్థాయి అధికారులు

కల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని తహశీల్దార్ జయసింహ, ఎంపీడీవో రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటూ జిల్లా స్థాయి అధికారులు, పులిచెర్ల, రొంపిచెర్ల మండల స్థాయి అధికారులందరూ హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు.





గుడిపాల మండలంలోని ఏఎల్‌పురంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో) - చిత్తూరు కలెక్టరేట్‌లో మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ బోర్డు

మనమిత్రలో మరిన్ని సేవలు

15నుంచి 700సేవలు అందుబాటులోకి

చిత్తూరు కలెక్టరేట్,ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలకోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వాటిని ఇంటి నుంచే పొందేందుకు రాష్ట్రప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్‌ను తీసుకొచ్చింది. మన మిత్ర పేరిట అమలవుతున్న ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఎక్కడినుంచైనా సేవలు పొందేందుకు, ఫిర్యాదులు చేసేందుకు సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించారు.మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఈ పౌరసేవలు అందిస్తున్న ప్రభుత్వం వాటిని 700కు పెంచాలని నిర్ణయించింది. ఈనెల 15వ తేదీనుంచి మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ఈ సేవలను అందించేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జనవరిలో 26 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 161 సేవలతో 'మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్' ప్రారంభం కాగా, సేవలను క్రమంగా పెంచారు. ప్రస్తుతం 500సేవల దాకా అందుతున్నాయి. వీటిని 15వ తేది నుంచి 700దాకా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాలనలో టెక్నాలజీ వినియోగానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం 'మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్' పేరుతో పౌరసేవలు సెల్‌ఫోన్ ద్వారా అందుబాటులో తెచ్చిన విషయం తెలిసిందే. ఇందులో విద్యార్థులకు పరీక్షల హాల్‌టికెట్లు, రేషన్ కార్డుల సేవలు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ స్టేటస్‌లు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.తెలుగు, ఆంగ్ల భాషల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. పౌరులు ఒక్క క్లిక్‌తో లైసెన్సులు, పన్నులు, బిల్లులు చెల్లించవచ్చు. ఆలయాల దర్శనాల బుకింగు, పరీక్షల ఫలితాలు ఇంటివద్దనుంచే తెలుసుకునే అవకాశం కల్పించారు. అన్నిశాఖల డేటాను ఆర్టీజీఎస్‌తో ప్రభుత్వం అనుసంధానం చేసింది. ప్రతిఒక్కరి వ్యక్తిగత సమాచారం ప్రభుత్వం వద్ద ఉంది. దీనిని శాఖలవారీగా మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్‌కు అనుసంధానం చేశారు. క్యూఆర్ కోడ్‌తో ధ్రువపత్రాలు, ఇతర పౌరసేవలు పొందవచ్చు. భవిష్యత్తులో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నకిలీ, అసలు గుర్తించే సౌలభ్యం అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ వాట్సప్ నెంబరు 9552300009ను మనమిత్ర పేరిట మీ ఫోన్‌లో నమోదుచేసుకోవాలి. ఆ నెంబరుకు హాయ్ అని సందేశం పంపాలి. వెంటనే ఏపీ ప్రభుత్వ లోగోతో ఒక సందేశం వస్తుంది. తద్వారా మీకు కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవాలి. వెంటనే మీకు వాట్సప్‌లో ఏఐ ఆధారిత చాట్ బాక్స్‌లో లభ్యమయ్యే అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుంది. అందులో మీకు కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవచ్చు. వాయిస్ కమాండ్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు. మీరు కోరుకున్న సేవకు సంబంధించి చాట్ బాక్స్ మరికొన్ని అదనపు వివరాలు అడగవచ్చు. మీ ఆధార్ నెంబర్, మొబైల్ నెంబరు, లేదా సర్వీస్ రిక్వెస్ట్ ఐడీ లాంటివి. మీరిచ్చిన వివరాలను ఒక్కసారి తనిఖీ చేసి, తర్వాత అందులో సిస్టమ్ మీకు రియల్‌టైం అప్‌డేట్స్ ద్వారా ఒక కన్ఫర్మేషన్ సందేశం పంపుతుంది. చెల్లింపులకోసం భద్రతతో కూడిన ఒక పేమెంట్ లింకును కూడా పంపుతుంది. మీరు జరిపిన లావాదేవీలకు సంబంధించి డిజిటల్ కాపీ లేదా రసీదును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. చాట్‌బాక్స్‌లో ధ్రువీకరణ పత్రాలు, రశీదులు లేదా అక్నాలెడ్జ్‌మెంట్ రూపొందించి మీకు అందిస్తుంది.

కనులపండువగా వరసిద్ధుడి కల్యాణోత్సవం



ప్రధాన ఆలయంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ అధికారులు, ఉభయదారులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం కాణిపాక ప్రధాన ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడికి కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. తొలుత కల్యాణ వేదిక వద్ద స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవం ముగిసిన అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడికి ప్రధాన ఆలయం ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన రేపాకుల కోదండరామిశెట్టి, ఆయన సోదరులు ఉభయదారులుగా వ్యవహరించారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, ఉభయదారులు పాల్గొన్నారు.

ఆగస్టు వర్షమంతా ఇప్పటికే కురిసింది!

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 19 మండలాల్లో భారీ వర్షాలు కురిసాయి. అత్యధికంగా బైరెడ్డిపల్లెలో 74.6, అత్యల్పంగా చౌడేపల్లిలో 7 మిమీ వర్షపాతం నమోదయ్యింది. మండలాలవారీగా బంగారుపాళ్యంలో 46, గుడుపల్లెలో 42.4, వి.కోటలో 26.2, పలమనేరులో 24, నింద్రలో 21.6, సోమలలో 20.4, పుంగనూరులో 19.6, సదుం, పెనుమూరులలో 17.8, గంగవరంలో 16.4, రామకుప్పంలో 16.2, తవణంపల్లెలో 14.6, నగరిలో 12.2, కుప్పంలో 11.2, పెద్దపంజాణిలో 10.8, పూతలపట్టులో 10.4, శాంతిపురంలో 9.2 మిమీ వర్షం కురిసింది. అదును దాటాక పడుతున్న వర్షాలతో రైతులు తమ పంటలను కాపాడుకోలేకపోతున్నారు. ఇదిలావుండగా ఆగస్టు నెల సగటు వర్షపాతం 121.2 మిమీ కాగా, శనివారం నాటికి 121.2 మిమీ వర్షపాతం కురిసింది. కాగా ఈనెల 12వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది.



సభలో ప్రసంగిస్తున్న నారాయణ

వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని ధ్వంసం చేశారు

● సీపీఐ మహాసభల్లో నారాయణ ధ్వజం

నగరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):వైసీపీ హయాంలో రాష్ట్రం విధ్వంసానికి గురైందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు.నగరిలో శనివారం సాయంత్రం ప్రారంభమైన సీపీఐ చిత్తూరు జిల్లా 24వ మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ వైసీపీ వారి అండదండలతో ఇటీవల తిరుపతిలో ఓ దళితుడిని రూమ్‌లో బంధించి విచక్షణారహితంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు ఇవ్వకపోతే ఏ పనులూ కావడంలేదని సామాన్యులు వాపోతున్నారన్నారు. ప్రకృతి అందాలకు నిలయంగా వుండే నగరి నేడు బోసి కొండలతో దర్శనమిస్తోందని, తమిళనాడుకు ఇష్టానుసారం మట్టి, ఇసుక తరలించేశారని విమర్శించారు. రాష్ట్రంలో 52 శాతం వున్న బీసీలకు రాజ్యాధికారం ఇవ్వాలని, చట్ట సభల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు ఇవ్వాలన్నారు.సభకు ముందు నగరిలో ఎర్రదండు కదం తొక్కింది.ఓంశక్తి ఆలయం వద్ద నుంచి బస్టాండు వరకు సీపీఐ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు.సీపీఐ రాష్ట్ర కార్యదర్శి హరినాథ రెడ్డి, కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి నాగరాజు, నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, వేలన్, బషీర్ బాషా, మురళి, శేఖర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నగరి వీధుల్లో సీపీఐ శ్రేణుల ర్యాలీ

శ్రావణ పౌర్ణమి గరుడసేవ



తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి):శ్రావణ పౌర్ణమి సందర్భంగా తిరుమలలో శనివారం రాత్రి గరుడ వాహనసేవ వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ విశేష అలంకరణలో మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడుడిపై కొలువుదీరి నాలుగుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ పౌర్ణమి కావడంతో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 24 నుంచి జరుగనున్న నేపథ్యంలో ఈ గరుడసేవను టీటీడీ ట్రయల్ రన్‌గా భావించి అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులకు పలు సూచనలు చేశారు. వీలైనంత ఎక్కువ మంది భక్తులు గరుడ వాహన సేవను వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టీటీడీ జీయర్‌స్వాములు, బోర్డు సభ్యులు రంగశ్రీ, దివాకర రెడ్డి, జానకీదేవి, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

తిరుమలలో వైభవంగా శ్రావణ ఉపకర్మ



తిరుమలలో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రావణ ఉపకర్మ-నూతన యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు శ్రీకృష్ణస్వామిని భూవరాహస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అర్చకులు అభిషేకించారు. అనంతరం స్వామివారికి నూతన యజ్ఞోపవీతాన్ని సమర్పించి, ఆస్థానం నిర్వహించారు. తర్వాత శ్రీకృష్ణస్వామిని ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి వేంచేపు చేశారు. ఈ కార్యక్రమంలో పారుపత్తేదార్ హిమంతగిరి, అర్చకులు, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

చెత్తరహిత రాష్ట్రం దిశగా పనులు ప్రారంభించాం

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి రామ్



తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని చెత్త రహితంగా మార్చే దిశగా పనులు ప్రారంభించామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. తిరుమల శ్రీవారిని శనివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, వీటికి శ్రీవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నామని చెప్పారు. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మొక్కు చెల్లించుకునేందుకు కాలినడకన తిరుమలకు వచ్చానన్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అభివృద్ధి వైపు నడవాలని కోరుకున్నట్టు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.17 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,480

తలనీలాలు సమర్పించినవారు: 28,923

రారాజును చూద్దాం.. రారండి



జూపార్కులో లయన్ సఫారీ వాహనం

మంగళం ఆంధ్రజ్యోతి

సింహం.. అడవికి రారాజు.. ధైర్యసాహసాలకు మారుపేరు. వేటాడటంలో దీని నైపుణ్యమే వేరు. బాల్యంలో కథా వస్తువుగా నిలిచే ఈ మృగరాజు ఆఫ్రికన్ దేశాల్లో హవా చాటుకుంటున్నా మనదేశంలో అంతరించిపోతున్న జంతువుల జాబితాలో చేరిపోయింది. గుజరాత్ లాంటి కొన్ని రాష్ట్రాల అడవుల్లో మాత్రమే ఉనికి చాటుకుంటోంది. ఐదేళ్ల క్రితం నాటికి 674 సింహాలు మాత్రమే ఉన్నట్లు లెక్క తేలింది. మన రాష్ట్రంలో ప్రదర్శన శాలలకు, సర్కస్‌లో వినోదానికి పరిమితమవుతోంది. ఆదివారం సింహాల దినోత్సవం సందర్భంగా తిరుపతి ఎస్వీ జూపార్క్‌లోని సింహాల గురించి తెలుసుకుందాం..

జూ పార్కులో పది సింహాలున్నాయి. వీటిలో ఐదు మగవి, ఐదు ఆడవి. వీటిలో బయట ఎన్‌క్లోజర్‌లో రెండు ఆడ, ఒక మగ సింహం ఉన్నాయి. లయన్స్ సఫారీలో నాలుడు ఆడవి, మూడు మగవి ఉన్నాయి. 2001లో సర్కస్ నుంచి తీసుకువచ్చిన 87 సింహాలలో వయసు పైబడి 86 చనిపోయాయి. వీటిలో ఒక్కటి మాత్రమే సజీవంగా ఉంది. ఈ మృగరాజుల సాధారణ వయసు 24ఏళ్లు. అడవిలో ఉండేవి 14 సంవత్సరాలు మాత్రమే బతుకుతాయని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. జూపార్కుల్లో సింహం 20 సంవత్సరాలకు పైగా బతుకుతుంది. సర్కస్ నుంచి తీసుకువచ్చిన సింహాలకు పుట్టినవే ఇప్పుడు జూపార్కులో సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.

నేడు సింహాల దినోత్సవం



జూపార్కులో సందర్శకులను ఆకట్టుకుంటున్న సింహాలు

సఫారీ సందర్శనకు వాహనాలు

జూపార్కులో సింహాల సఫారీలోని వెళ్లే సందర్శకుల కోసం ఆరు వాహనాలను ఏర్పాటు చేశారు. పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30గా టిక్కెట్ వసూలు చేస్తున్నారు. ఈ వాహనంలో ప్రయాణిస్తూ సింహాలను దగ్గరగా చూసేందుకు అవకాశం ఉంటుంది. సింహాలు సందర్శకులపై దాడి చేయకుండా ఈ వాహనాలను కట్టుదిట్టమైన ఇనుప కంబీలతో ఏర్పాటు చేశారు.

రోజువారీ ఆహారమిలా..

జూపార్కులో సింహాలకు రోజూ అర లీటరు పాలు, ఐదు నుంచి ఆరు కేజీల బీఫ్, రెండు కేజీల చికెన్, రెండు కోడిగుడ్లు వంతున ఆహారంగా అందిస్తున్నారు. వీటి సంరక్షణలో జంతు ప్రేమికులను భాగస్వాములుగా చేయడానికి అధికారులు అవకాశం కల్పిస్తున్నారు. దత్తత తీసుకునేందుకు ఆహ్వానం పలుకుతోంది. రోజుకు అయ్యే ఖర్చు రూ.1,330, వారానికి రూ.9,310, నెలకు రూ.39,900, మూడు నెలలకు 1,19,700 ఆరు నెలలకు రూ.2,39,400, సంవత్సరానికి రూ.4,85,450 మొత్తాన్ని జూపార్కు అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. ఇలా చేస్తే మీరు కూడా సింహాల సంరక్షణలో భాగస్వాములయినట్లే.

పవన్‌ను బంధించింది ఎవరు?

తిరుపతి నుంచి చిత్తూరుకు ఎలా వెళ్లాడు?

వైసీపీ దాడి ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల చేతిలో దారుణ హింసకు గురైన పవన్‌కుమార్‌ను చిత్తూరులో బంధించింది ఎవరు? అతని వాయిస్ రికార్డు చేసి వీడియోలు విడుదల చేసిందెవరు? తిరుపతిలో దాడికి గురైన పవన్ చిత్తూరుకు ఎలా వెళ్లాడు? రౌడీ మూకలకు భయపడి తలదాచుకున్నాడా? లేకుంటే ఎవరైనా బలవంతంగా తీసుకెళ్లి బంధించారా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ వ్యవహారంలో తిరుపతికి చెందిన వైసీపీ కీలక నేతల ప్రమేయంపైనా ఆరా తీస్తున్నారు.

గొడవకు కారణాలపై ఆరా

తిరుపతిలోని ఒక హోటల్‌లో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న పవన్‌కుమార్‌ను, వైసీపీ నేతలకు మధ్య గొడవకు గల కారణాలపైనా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. కేవలం డబ్బు వ్యవహారమేనా లేదా పాత కక్షలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీస్తున్నారు.

దర్యాప్తు వేగవంతం

ఈ ఘటనను ప్రభుత్వ పెద్దలు సీరియస్‌గా తీసుకోవడంతో జిల్లా పోలీసులు దర్యాప్తులో వేగం పెంచారు. అదనపు ఎస్పీ నేతృత్వంలో డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది టీమ్‌లుగా విడిపోయి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు అనిల్‌కుమార్ రెడ్డి, బైక్ రెంటల్ అధినేత జగదీశ్వరరెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసుల అదుపులో ఉన్న మరో నిందితుడు దినేష్‌ను విచారిస్తున్నారు. మరికొందరు అనుమానితుల పాత్రపై దర్యాప్తు చేస్తున్నారు.

పవన్ దాడి వెనుక భూమన హస్తం

- శాప్ చైర్మన్ రవినాయుడు -

తిరుపతి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): దళిత యువకుడు పవన్‌పై దాడి వెనుక వైసీపీ నేతలు భూమన కరుణాకర రెడ్డి, అభినయ్ హస్తముందని శాప్ చైర్మన్ రవినాయుడు ఒక ప్రకటనలో ఆరోపించారు. పవన్‌ను బెదిరించి వారికి అనుకూలంగా వీడియో చేయించారని, భూమన కుటుంబం వల్ల ప్రాణహాని ఉందని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అభినయ్ ప్రధాన అనుచరుడు ఉదయ్ వంశీ ద్వారా దాడి అనంతరం పవన్‌ను కిడ్నాప్ చేశారని తెలిపారు. ఈ క్రతువుకు డబ్బు సమకూర్చింది అభినయ్ అని ఆరోపించారు. కిడ్నాపర్లు, ఉదయ్ వంశీల ఫోన్ పేలు చెక్ చేస్తే అన్ని ఆధారాలు బయటపడతాయని వివరించారు. కరుణాకరరెడ్డి, అభినయ్‌లపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో మాజీ మంత్రి ఆర్కే రోజా, ఎమ్మెల్సీ కల్యాణి, కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం రోజా ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ శ్రావణమాసం, శ్రావణ నక్షత్రం, శనివారం రోజున శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన కుటుంబంతోపాటు రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు.

తిరుమలలో విజయనగరం జిల్లావాసి అదృశ్యం



సురేష్ (ఫైల్ ఫొటో)

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన విజయనగరం జిల్లావాసి కనిపించడం లేదంటూ శనివారం తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విజయనగరం జిల్లా, కన్విటి మ్మాపురానికి చెందిన సురేష్(37) గత నెల 19వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వచ్చాడు. అదే రోజు తిరుమలలోని యాత్రిసదన్ వద్ద కనిపించకుండా పోయాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు అతని కోసం తిరుమల, తిరుపతి, సొంత ఊర్లలో గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సురేష్ వివరాలు తెలిసిన వారు 9440796772కు తెలియజేయాలని కోరారు.

జోరుగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు





బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న శ్రీవారి తేరు, పుష్కరిణి

తిరుమల, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. టీటీడీ ఏడాదికోసారి టీటీడీ అత్యంత వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీటీడీ ఇంజినీరింగ్ విభాగం ఏర్పాట్లను ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం శ్రీవారి మహారథం(చెక్కతేరు)ను సిబ్బంది సిద్ధం చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే మాడవీధుల్లోని విద్యుత్ లైట్లకు మరమ్మత్తులు చే పట్టారు. పాడైపోయిన లైట్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. అలాగే శ్రీవారి పుష్కరిణిలోని నీటి ఇప్పటికే తొలగించి లోపలున్న బావుల్లో, నీటి పైపులకు మరమ్మత్తులు చేస్తున్నారు. ఈనెలాఖరులోగా పనులన్నీ పూర్తిచేసిన తిరిగి నీటిని నింపనున్నారు. ఇక, మాడవీధులు, ఆలయ పరసర ప్రాంతాల్లో బారికేడ్లు, గ్యాలరీలను ఏర్పాటు చేసే పనులు కూడా మొదలయ్యాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుపతిలో దళిత యువకుడిపై దాడి దుర్మార్గం

● సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

తిరుపతి, ఆగస్టు9(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో దళిత యువకుడిని గదిలో బంధించి వైసీపీ నాయకులు దాడి చేయడం దుర్మార్గపు చర్య అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడి చేసిన వారు భూమన కరుణాకరరెడ్డి, అతని తనయుడు అభినయ్ అనుచరులని ప్రచారం సాగుతున్న నేపథ్యంలో వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి ఖండించకపోవడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. నిందితులు కరుణాకరరెడ్డి ఇంటి వద్ద అరెస్టు కావడంపై వారిపైనే అనుమానం వస్తోందని తెలిపారు. మోదీ ప్రభుత్వం కేవలం చంద్రబాబు, నితీష్ వల్ల మనుగడ సాగిస్తోందన్నారు. అమెరికా అధ్యక్షుడు ప్రపంచ పోలీస్‌గా వ్యవహరిస్తున్నారని, ట్రంప్‌ను మోదీ ఇప్పటివరకు వ్యతిరేకించడం లేదని తెలిపారు. ట్రంప్ ఆర్థిక ఆంక్షల పేరుతో బ్లాక్ మెయిల్ చేస్తున్నా మోదీకి జ్ఞానోదయం కాకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రచారంలో ఉన్న దొంగ ఓట్ల జాబితా ఎన్నికల కమిషన్ నిర్లక్ష్యపు పనితీరుకు అద్దం పడుతోందన్నారు. గతంలోనే ఓట్ల చేర్పులు, తొలగింపులపై తిరుపతిలో జరిగిన ఎన్నికల సందర్భంగా ఆధారాలతో సీపీఐ ఆధ్వర్యంలో చూపించామని గుర్తు చేశారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ జాతీయ స్థాయిలో నిరూపించారని అన్నారు. ఎన్నికల కమిషన్ ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించలేదన్నారు. స్వతంత్ర సంస్థలుగా పనిచేయాల్సిన వ్యవస్థలు మోదీ నియంత్రణలోకి వెళ్లిపోయాయన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటుపై న్యూయార్క్ కోర్టులో మాజీ ముఖ్యమంత్రిపై కేసు నడుస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చితే దేశ వ్యాపితంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ మీడియా సమావేశంలో సీపీఐ నేతలు హరినాథ్ రెడ్డి, పి.మురళి, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్‌లు పాల్గొన్నారు.

ఊపిరితిత్తుల సమస్యలకు ఆధునిక వైద్య పద్ధతులు

● వైద్యరంగంలో పల్మనాలజిస్టుల పాత్ర కీలకం ● అప్సకాన్ జాతీయ సదస్సులో ఎమ్మెల్యే ఆరణి



అప్సకాన్ సదస్సులో పాల్గొన్న ప్రముఖ వైద్య నిపుణులు, నేతలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఊపిరితిత్తుల సమస్యను నివారించేందుకు ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళం సమీపంలోని ఆశా కన్వెన్షన్‌లో అప్సా (ఆంధ్రప్రదేశ్ సీమాంధ్ర పల్మనాలజిస్టుల అసోసియేషన్) ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ప్రేమానంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సుబ్బారావుల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 6వ వార్షికోత్సవ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆస్మా, టీబీ, సీవోపీడీ, న్యూమోనియా వంటి ఊపిరితిత్తుల సమస్యల పరిష్కారంలో పల్మనాలజిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. రుయాస్పత్రి పరిధిలో సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఆఫ్ పల్మనాలజీ ఏర్పాటుకు సహకరించాలని ఎమ్మెల్యేకు అసోసియేషన్ ప్రతినిధులు విన్నవించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పల్మనాలజీ రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు, నూతన పద్ధతుల గురించి వైద్య నిపుణులు వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరిరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎస్వీ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రాధ, సైంటిఫిక్ కమిటీ సభ్యురాలు డాక్టర్ నీతిచంద్ర పాల్గొన్నారు.

విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు

● ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్



గిరిజన విద్యార్థులకు పారితోషికం అందజేస్తున్న జిల్లా కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. స్థానిక గిరిజన భవన్‌లో శనివారం జరిగిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ ప్రసంగించారు. జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తన దృష్టిలో ఉన్నాయన్నారు. గిరిజన భవన్ మరమ్మతుల నుంచే పనులు ప్రారంభిస్తామన్నారు. నెలాఖరులోపు రూ.20 లక్షలు మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నారు. తుడా చైర్మన్, కార్పొరేషన్ వారితో మాట్లాడి అదనంగా మరో రూ.10 లక్షలు మంజూరు చేయాలని కోరుతానని అన్నారు. మూడు నెలల్లో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల మంజూరుకు చర్యలు తీసుకుంటానని, ఎస్టీ విద్యార్థుల కోసం ప్రత్యేక జాబ్‌మేళా ఏర్పాటు చేస్తామన్నారు. ఆదివాసులు ఉన్న ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించి ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. తాను 5 కుటుంబాలను దత్తత తీసుకున్నానని వచ్చే 6 నెలల్లో వారి అవసరాలను సంపూర్ణంగా నెరవేరుస్తానని పేర్కొన్నారు. జిల్లాలో 82 వేల కుటుంబాలను గుర్తించి వారిలో 42 వేల కుటుంబాలను పలువురు దత్తత తీసుకున్నారని వివరించారు. ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ ఆదివాసులను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అనంతరం 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు కలెక్టర్ పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, గిరిజన సంక్షేమశాఖ అధికారి రాజాసోము, గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణ, బంజార సంఘం అధ్యక్షుడు తలపుల మల్లికార్జున, గిరిజన సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి సుమన్, యానాది సంఘం మహిళా కార్యదర్శి వసంతమ్మ, విశ్రాంత డీఎఫ్‌వో. టీటీడీ ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సురుటుపల్లె ఆలయ చైర్మన్ రేసులో ఆ నలుగురు



సత్యవేడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవి కోసం పలువురు పోటీపడుతున్నారు. జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో పళ్లికొండేశ్వరాలయం ఒకటి. పైగా తమిళనాడు రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో ఈ ఆలయ చైర్మన్ పదవికి పోటీ ఎక్కువగా ఉంటుంది. పాలకమండలి నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో ఆశావహులు పైస్థాయి నేతల ఆశీస్సుల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు. కేవీబీపురానికి చెందిన తొట్టంబేడు ఏఎంసీ మాజీ చైర్మన్ రామాంజులు నాయుడి పేరు చైర్మన్ రేసులో ప్రముఖంగా వినబడుతోంది. పార్టీలో సీనియర్ నేత కావడంతో రాష్ట్రస్థాయి నేతల ఆశీస్సులు మెండుగా ఉన్నాయి. అదేవిధంగా పిచ్చాటూరు మండలానికి చెందిన మాజీ ఎంపీపీ పద్మనాభరాజు పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన కూడా చైర్మన్ పదవి కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. నాగలాపురం మండలానికి చెందిన తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఆవుల రామ్‌ప్రకాష్ యాదవ్ ఈ పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. ఈయన ఇప్పటికే యువనేత లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను సంప్రదించి దరఖాస్తు అందించి ఉన్నారు. ఇదిలా ఉండగా సత్యవేడుకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త సల్లా కృష్ణయ్య పేరు తెరమీదకు రావడం గమనార్హం. కృష్ణయ్య కుటుంబ సభ్యుల్లో ఒకరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో పదవి ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

SUNDAY SPECIAL



దట్టమైన అడవులుండే ప్రాంతం తలకోన. ఎర్రచందనం.. నాటుసారా గుట్టుగా లాగించెయ్యవచ్చు. ఈ ప్రాంతంపై ఇటీవల పోలీసు డ్రోన్‌ల నిఘా పెట్టారు. ఏప్రిల్ 27న ఎర్రావారిపాళెం మండలం వేములవాడ సమీపంలో అడవిపైన ఎగురుతున్న డ్రోన్‌కి అనుమానాస్పద సంకేతాలు అందాయి. వాటి ఆధారంగా కెమెరా జూమ్ చేశారు. తలకోన జలపాతం వాగు దగ్గరలోని ఒక చెట్టు తొర్రలో నుంచి సిగ్నల్స్ అందుతున్నాయి. తీరా చూస్తే చెట్టు తొర్రలో 10 లీటర్ల నాటుసారా ఉంది. ఈ సంఘటనలో ఇద్దరు నాటుసారా తయారీదార్లను వెంటనే అదుపులోకి తీసుకున్నారు.

తిరుపతి రూరల్ మండలంలో స్వర్ణముఖి నదీ తీరం కంపచెట్లతో నిర్జనంగా ఉంటుంది. ఈ ప్రాంతంపై ఎగురుతున్న డ్రోన్ కెమెరా కంట్లో పొదల్లో ఏదో కదలిక పడింది. జూమ్ చేసి చూడగా కొంతమంది అక్కడ డ్రగ్స్ తీసుకుంటున్నారు. ఇంజక్షన్‌లు, మత్తు బిళ్లలు కనిపించాయి. వెంటనే బీట్ పోలీసులకు సమాచారం అందింది. 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. శంకర్‌నాయుడు కాలనీ సమీపంలో జూన్ 18న ఈ సంఘటన జరిగింది.

ఆకాశ గూఢచారి

తిరుచానూరు సమీపంలోని పాడుపడ్డ భవనాల మీద డ్రోన్ నిఘా పెట్టారు. నలుగురు యువకులు గంజాయి సేవిస్తూ దొరికిపోయారు. ఎనిమిది ప్యాకెట్లు గంజాయి స్వాధీనం చేసుకున్నారు.



● తిరుపతి పోలీసులకు అందిన హై టెక్నాలజీ డ్రోన్లు

కథనం - ఆంధ్రజ్యోతి, తిరుపతి(నేరవిభాగం)

తిరుపతి జిల్లా పోలీసుల పొదిలోకి ఇటీవల అందిన ఒక సాంకేతిక ఆయుధం డ్రోన్. భిన్న అవసరాలకు ఉపయోగపడే, వివిధ సామర్థ్యాలున్న 9 డ్రోన్‌లు ప్రభుత్వం తిరుపతికి కేటాయించింది. దేశ నలుమూలల నుంచి వచ్చే జనంలో నేరస్థులు సులువుగా కలగలిసిపోయే అవకాశమున్న ప్రాంతం కావడంతో వీటి అవసరం మరీ ఎక్కువ. అలాగే తరచూ వీవీఐపీల పర్యటనలు, భారీ సభలు జరుగుతుండడంతో క్రౌడ్ కంట్రోల్‌కి కూడా డ్రోన్‌ల సాయం పోలీసులకు బాగా ఉపయోగపడుతోంది. నేరస్థుల గుండెల్లో దడపుట్టించే పనులను ఈ డ్రోన్‌లు చేస్తున్నాయి. జిల్లా పోలీసు విభాగానికి అందిన డ్రోన్‌లు.. వాటి విశేషాలు...

బాహుబలి — టెథర్డ్ డ్రోన్

ఈ డ్రోన్ అత్యంత శక్తివంతమైంది. తిరుపతి వంటి భక్తజనం వచ్చిపోయే ప్రదేశంలో దీని అవసరం ఎక్కువ అని గుర్తించారు. దీని విలువ రూ.30లక్షలు. 100 నుంచి 140 మీటర్ల ఎత్తులోనే ఎగురుతూ అయిదు కిలోమీటర్ల దూరం వరకూ తిరుగుతూ పర్యవేక్షిస్తుంది. ఐదు కిలోల బరువున్న వస్తువులను కూడా దీనిద్వారా అత్యవసర సమయాల్లో చేరవేయవచ్చు. దాదాపు 8 గంటల పాటు నిరంతరాయంగా ఎగరగల సామర్థ్యం దీనికి ఉంటుంది. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి వంటి వీవీఐపీల పర్యటనల సమయంలో పోలీసులకు బాగా ఉపయోగపడుతుంది. దాదాపుగా 30 కిలోల బరువుంటుంది.



డీజేఐ ఏయిర్ త్రీ ఎస్ — ట్రాఫిక్ కంట్రోలింగ్

ఈ డ్రోన్ దాదాపు ఒక కిలోమీటరు ఎత్తు వరకూ ఎగురుతుంది. ఇక్కడి నుంచి ఐదు కిలోమీటర్ల రేడియస్‌లో ఫొటోలు తీస్తుంది. ట్రాఫిక్ నియంత్రణకు బాగా ఉపయోగపడుతుంది. రాంగ్ పార్కింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ, ఆపోజిట్ రూట్‌లో రావడం,, ట్రిబుల్ రైడింగ్ వంటివి గుర్తించి చలానాలు వేయడంలో పోలీసులకు బాగా సహకరిస్తుంది. ఇక ర్యాలీలు, ధర్నాలు, జాతర్ల సమయంలో ఇది నింగిలోంచి నిఘా పెడుతుంది. అలాగే నగర శివారు ప్రాంతాల్లో, పాడుబడ్డ భవనాల వద్ద అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిని గుర్తిస్తుంది. ఇవి జిల్లాలో ఏడు ఉన్నాయి.

మ్యాట్రిక్స్ 4టీ థర్మల్ — ఆకాశంలో నిఘా



దాదాపుగా కంటికి కనిపించనంత ఎత్తున ఎగురుతుంది ఈ డ్రోన్. నాలుగు నుంచి ఆరు కిలోమీటర్ల ఎత్తు దాకా ఎగురగలదు. అతి తక్కువ శబ్దం చేస్తుంది. నైట్ విజన్ కెమరాలు ఉన్నందున చిమ్మచీకటిలోనూ ఫొటోలు తీస్తుంది. 5 కిలోమీటర్ల రేడియస్‌లోని ఫొటోలు తీయగలదు. ఈ డ్రోన్‌లో 112ఎక్స్ జూమింగ్ కెమెరా ఉన్నందున అంత ఎత్తు నుంచి కూడా క్లోజప్ ఫొటోలు తీయగలదు. ఒకరకంగా ఇది నింగిలో నుంచి నేలమీద నిఘాకు బాగా ఉపయోగపడుతుంది. ఏఐ టెక్నాలజీ ఉంది. రద్దీ ప్రాంతాల్లో ఎంతమంది ఉన్నారో కూడా లెక్కకట్టి చెప్పేస్తుంది. రహదారుల్లో ప్రయాణించే వాహనాల నంబర్లను కూడా జూమ్ చేసుకుని గుర్తించి నిక్షిప్తం చేసుకుంటుంది. గుద్దేసి వెళ్లిపోయే వాహనాలను ఇట్టే పట్టేస్తుంది. ఈ డ్రోన్‌లో స్పాట్ లైట్, స్పీకర్ కూడా అమర్చబడి ఉంటాయి. అత్యవసర సమయాల్లో ఈ స్పీకర్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేసే వీలుంది. ప్రజల్ని హెచ్చరించడానికి అనువుగా సైరన్ కూడా ఉంటుంది. భారీ భవనాల్లో అగ్నిప్రమాదాలు, వరదలు వంటి సమయాల్లో చాలా ఉపయోగపడుతుంది. ఇవి జిల్లాలో రెండు ఉన్నాయి.

పంటలపై ఆగని గజదాడులు

● ఆందోళనలో పులిచెర్ల మండల రైతులు





ఏనుగులు ధ్వంసం చేసిన టమోటా పంట - ఏనుగులు విరిచేసిన రాతి కూసాలు

కల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజరాజుల దాడులు ఆగడంలేదు. రోజూ ఎక్కడో ఒకచోట ఏనుగుల గుంపు పంటలపై దాడి చేసి ధ్వంసం చేస్తున్నాయి. ప్రధానంగా టమోటా, మామిడి, కొబ్బరి, అరటి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మండలంలోని దేవళంపేట పంచాయతీలో శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో పంటలకు అపారనష్టం వాటిల్లింది. దీంతో బాధిత రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతు నాగరాజమ్మకు చెందిన అరటి, బొప్పాయి చెట్లను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు రాతికూసాలను విరిచేశాయి. అక్కడి నుంచి పెనుబాలవారిపల్లి వద్దకు చేరుకొని రైతు నారాయణకు చెందిన కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. మిట్టమీదరాచపల్లిలోని రైతు భాస్కర్‌కు చెందిన టమోటా, వంకాయ, మామిడిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. దిగుమూర్తివారి పల్లిలోని రైతు నరసింహులుకు చెందిన వంగ, మామిడి, పశుగ్రాసాన్ని ధ్వంసం చేశాయి. ఏనుగుల గుంపు అక్కడి నుంచి హంద్రీ-నీవా కాలువ మార్గంలో అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. శనివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు, బోడబండ వద్ద తిష్ట వేసినట్లు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

రామకుప్పంలో కుండపోత

రామకుప్పం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం ప్రాంతంలో శనివారం పెనుగాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. గత మూడు రోజులుగా భారీ వర్షాలు అటవీప్రాంతానికే పరిమితమయ్యాయి. అటవీ ప్రాంతంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు వర్షపునీటితో నిండిపోయాయి. పలుచెరువులు నిండి మొరవ పోతున్నాయి. భారీ వర్షంతోపాటు బలమైన గాలులు తోడయ్యాయి. రామకుప్పం పట్టణ వీధులతో పాటు రామకుప్పం చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే రహదారులు, వంకలు, వాగుల్లో వర్షపునీరు ప్రవహించాయి. చెరువులు, కుంటల్లోకి వర్షపునీరు భారీగా చేరాయి. గాలులు వీయడంతో పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగిపోయి కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రెస్కో సిబ్బంది వర్షంలో సైతం గ్రామాలకు చేరుకొని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



రాజుపేట వద్ద హంద్రీ-నీవా కాలువలో చేరిన వర్షపునీరు

పుంగనూరు ఏఎంసీ చైర్మన్‌గా శమీపతి




శమీపతి - వెంకట్రమణ

పుంగనూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నల్లబాల శమీపతి తోబాటు 20 మందిని పాలకవర్గ సభ్యులుగా నియమిస్తూ శనివారం ప్రభుత్వ ఎక్స్‌అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ జీవో ఉత్తర్వులు జారీ చేశారు.ఉంగనూరు మండలం రాగానిపల్లె పంచాయతీ మల్లుపల్లెకు చెందిన ఎస్.శమీపతిని చైర్మన్‌గా, మాగాండ్లపల్లెకు చెందిన పి.వెంకట్రమణను వైస్ చైర్మన్‌గా నియమించారు. అలాగే డైరెక్టర్లుగా ఎ.శాంతమ్మ, సి.చంద్రమ్మ, ఎన్.జయశ్రీ, బి.సుధాకర్‌రెడ్డి, ఎ.అమరనాథ నాయుడు, కె.మసెన్న, టి.చంద్రమ్మ, ఎం.అరుణ, బి.సంధ్య, బి.మంజునాథ్, ఎస్.అష్రఫ్‌బాషా, ఆర్.శ్రీదేవి, ఆర్.పాపులమ్మలతోపాటు సింగిల్ విండో చైర్మన్, వ్యవసాయశాఖ ఏడీ, మున్సిపల్ చైర్మన్, సింగిల్ జిల్లా మార్కెటింగ్ అధికారులను డైరెక్టర్లుగా, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని గౌరవ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా శమీపతి మాట్లాడుతూ పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో మార్కెట్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నగరిలో రైతు బజారు నిర్మాణానికి మరోసారి ఉత్తర్వులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరి రైతు బజారు నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నగరి బస్టాండ్‌లో సర్వే నంబరు 228/1లో 0.50 సెంట్ల స్థలాన్ని 2017లో అప్పటి కలెక్టర్ ప్రద్యుమ్న కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం మారడంతో అప్పటి ఎమ్మెల్యే రోజా ఈ స్థలంలో రైతు బజారు నిర్మాణానికి అడ్డుకట్ట వేశారు. దీంతో పాటు రైతు బజారును నగరానికి దూరంగా నిర్మించుకోవాలనే దానిపై వాదనలు చోటు చేసుకుంటున్నాయి. కాగా ఆ స్థలాన్ని నగరి మార్కెట్ కమిటీకి కేటాయించడంతో, ఇప్పుడు అదే స్థలంలో రైతు బజారు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ రూ.50 లక్షలు మంజూరు చేసింది. మార్కెటింగ్ అధికారులు సైతం స్థానిక ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ క్రమంలో నగరి బస్టాండ్‌లో కేటాయించిన స్థలంలో రైతు బజారు నిర్మిస్తారా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

వరసిద్ధుడి ఆలయానికి రూ.3 లక్షల విరాళం



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి తణుకుకు చెందిన శ్రీలలితాంబిక పార్మాటెక్స్ సర్వీసెస్ యజమాని రవిచంద్రబాలబాలాజీ శనివారం రూ.3,00,048 విరాళంగా అందించారు, ఇందులో నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.1,00,016, గోసంరక్షణ ట్రస్టుకు రూ.1,00,016, ఆలయ అభివృద్ధి పనులకు రూ.1,00,016 విరాళంగా అందించారు. దాతకు సూపరింటెండెంట్ కోదండపాణి దర్శన ఏర్పాట్లను కల్పించారు.

13న అమరరాజా నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో మహిళల ప్రవేశానికి ఇంటర్వ్యూలు

పూతలపట్టు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం పేటమిట్టలోని అమరరాజా నైపుణ్యాభివృద్ధి సంస్థలో ప్రవేశానికి ఈనెల 13వ తేదీన 16-30 సంవత్సరాల్లోపు ఉన్న 10వ తరగతి పాస్/ఫెయిల్, ఇంటర్మీడియట్ పాస్/ఫెయిల్ అయిన మహిళలకు ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు అడ్మిషన్ల ఇన్‌చార్జి జ్యోతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, ఎంపికైన మహిళలకు రూ.12,939 - రూ.13,139 వరకు స్టైఫండ్, ఉచిత భోజనం, వసతి సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 91004 77371, 81236 39646 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఉప్పొంగిన ఉలవకుంట వంక





యడగురికి సమీపంలో ప్రవహిస్తున్న ఉలవకుంట వంక - కుమ్మరమడుగు సమీపంలో నేలమట్టమై దెబ్బతిన్న కాకర తోట

వి.కోట , ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండల కృష్ణాపురం పంచాయతీ యడగురికి పరిసరాల్లో శనివారం భారీ వర్షపాతం నమోదైంది. రోజంతా కురిసిన వాన కారణంగా పలు రకాల పంటలు దెబ్బతిన్నాయి. శనివారం మధ్యాహ్నం మొదలైన వాన రోజంతా కురిసింది. దానమయ్యగారిపల్లె, యడగురికి, కుమ్మరమడుగు, మావత్తూరు, ఎగువపల్లె, జవ్వునిపల్లె ప్రాంతాల్లో రోజంతా కురిసిన వానతో చిన్నపాటి కుంటలు, వాగులు, వంకలు నిండి ప్రవహిస్తున్నాయి. చెరువులకు నీరు చేరుతోంది. గత ఐదేళ్లలో ఇలాంటి వర్షం తమ ప్రాంతంలో కురవలేదని స్థానికులు అంటున్నారు. వర్షానికి బీన్స్, చిక్కుడు, కాకర, బంతిపూల తోటలు దెబ్బతిన్నాయి. యడగురికి, దానమయ్యగారిపల్లె గ్రామాల నడుమ ప్రవహిస్తున్న వంక ప్రవాహం పరిసరాల్లోని కూరగాయల తోటల మీదుగా ప్రవహించడంతో పలు రకాల పంటలు నీటమునిగాయి. కుమ్మరమడుగుకు చెందిన రైతు సాగుచేసిన రెండెకరాల కాకర పంట పూర్తిగా నేలమట్టమైంది. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని.. రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఉదయ్ సంతోష్, ఏవో అప్పాజీ తెలిపారు. పంట నష్టంపై బాధితులకు పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

దళిత, గిరిజన కాలనీల్లో మౌలిక సదుపాయాలకు రూ.75 కోట్లు

● కలెక్టర్ సుమిత్‌కుమార్



యానాదులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ , మేయర్ అముద తదితరులు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.75కోట్లను ఖర్చుపెడుతున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ చెప్పారు. చిత్తూరు కలెక్టరేట్ ఆవరణలోని డీఆర్డీఏ సమావేశపు హాల్లో శనివారం నిర్వహించిన ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నగర మేయర్ అముద, జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడెల్‌తో కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 600 నివాస ప్రాంతాల్లో గిరిజనులకు మౌలిక వసతులు లేవని గుర్తించామన్నారు.ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సూచన మేరకు బంగారుపాళ్యం మండలం తుంబపాళ్యం గ్రామంలో 50మందికి అటవీ ప్రాంతంలోని చెరువుల్లో చేపలు పట్టుకోవడానికి అనుమతులు మంజూరు చేశామన్నారు. అలాగే సోమల మండలంలో ముచ్చుకాలువకు చెందిన 22 మంది యానాదులకు ఆర్‌ఓఆర్ పట్టాదార్ పాసుపుస్తకాలను పంపిణీ చేశామన్నారు. యానాదిసంఘ నేతలు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గిరిజన భవనం, స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం గిరిజన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సమావేశంలో జేసీ విద్యాధరి, యానాది సంఘ నేతలు చిరంజీవి, కృష్ణానాయక్, సుబ్బరాజు, ఆర్ముగం, రాజశేఖర్, గిరిధర్, కోదండన్, డీవీఎం సభ్యులు దేవరాజ్,రాజ్‌కుమార్, బాబు, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యం:టీడీపీ

చిత్తూరు సిటీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎస్టీల సంక్షేమానికి రూ.8,159 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. గిరిజన గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ కోసం 84 చెంచు గిరిజన గూడేల్లో రూ.2.22 కోట్లతో పనులు చేపట్టారని అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గిరిజనుల సొంతింటి కల నెరవేర్చేలా ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష, ఎస్టీలకు రూ.75 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఎస్టీ రిజర్వేషన్లు 4 శాతం నుంచి 6 శాతానికి పెంచినట్లు చెప్పారు. గిరిపుత్రికా కల్యాణ పథకం ద్వారా యువతికి పెళ్లి పీటలపైనే రూ.50 వేలు పెళ్లి కానుక అందజేస్తున్నారని తెలిపారు. ఎస్టీలకు స్వయం ఉపాధి యూనిట్ల పంపిణీ, అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం అమలుకు చర్యలు తీసుకుందన్నారు. గిరిజన గ్రామాల్లో కొత్త సచివాలయాలు ఏర్పాటు చేసి వాటిని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఉచిత కంటి పరీక్ష శిబిరం విజయవంతం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కుప్పం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలోని పీఈఎస్ అర్బన్ ఆస్పత్రిలో కుప్పం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీఈఎస్ ఆస్పత్రి సహకారంతో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 100 మంది పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వీరిలో 16 మందిని ఉచిత కంటి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశామన్నారు. ప్రతి రెండో శనివారం పీఈఎస్ అర్బన్ సెంటర్‌లో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సుదర్శన్, కార్యదర్శి శివ, ఉపాధ్యక్షుడు సెల్వం, సభ్యులు జయరాం నాయుడు, వెంకటస్వామి, కృష్ణమూర్తి, వరదరాజులు, ఏకాంబరం, సతీశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అల్బెండజోల్ మాత్రలతో నులిపురుగుల నివారణ



ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుభాష్ తదితరులు

కుప్పం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అల్బెండజోల్ మాత్రలు చిన్నపిల్లలు వేసుకోవడంతో నులిపురుగుల నివారణ సాధ్యమవుతుందని ఎన్.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుభాష్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయానికి అల్బెండజోల్ మాత్రలను శనివారం పంపిణీ చేశారు. నులిపురుగుల నివారణపై అవగాహన కలిగించే ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో అల్బెండజోల్ మాత్రలను అందజేయాలని సూచించారు. అలాగే సోమ, మంగళ వారాలలో అన్ని విద్యా సంస్థల్లో నులి పురుగుల నివారణపై పిల్లలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, పర్యవేక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పూర్వ విద్యార్థులతో గురువులు

సోమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లె హైస్కూల్‌లో 1999- 2000 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. నాటి తరగతి గదుల్లో తిరగాడి నాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. కుటుంబ సభ్యులను పరిచయం చేసుకుని ఆనందం పంచుకున్నారు. పాఠశాల పూర్వ విద్యార్థులు గ్రంథాలయ పుస్తకాల కొనుగోలు, ఫర్నీచర్‌కు రూ.50 వేలు పాఠశాలకు అందించారు. నాటి గురువులు వెంకటరమణ, అనసూయమ్మ, శంకర్‌రెడ్డి, కృష్ణమరాజు, జనార్దన్‌రాజు, శివశంకర్‌లను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమాలను వినోద్‌కుమార్, కిరణ్‌కుమార్, గుణశేఖర్, మస్తాన్, సాంబశివ పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. లోకేశ్వరి, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు యదుశేఖర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ బగళనత్తానికి చెందిన నారాయణరెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి స్థానిక నేతలతో కలిసి నారాయణరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు పెరుమాళ్, గోవిందన్, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి మునిరెడ్డి, నేతలు చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, మంజునాథరెడ్డి, రాఘవేంద్ర, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి చల్లా నివాళి



టీడీపీ నాయకుడి మృతికి నివాళులర్పిస్తున్న చల్లా బాబు

రొంపిచెర్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల బజారువీధికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు కృష్ణమూర్తిశెట్టి మృతికి పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. శనివారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, మాజీ జడ్పీటీసీ లక్ష్మీనారాయణ, వంకాయల రామకృష్ణ, నాయకులు అమరనాథరెడ్డి, ఉయ్యాల రమణ, షేక్ కరీముల్లా, రామమూర్తి, రాధాకృష్ణ, నాగరాజ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మోసంపై పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు స్టేట్ బ్యాంకు ఏటీఎం కేంద్రం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఏటీఎం కార్డు మార్పు చేసి నగదు డ్రా చేశారంటూ ఓ యువకుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు... నిమ్మనపల్లె మండలం కత్తిరివారిపల్లెకు చెందిన మల్లయ్య కుమారుడు వెంకటేశ్ (23) అనారోగ్యంతో పుంగనూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవడానికి వచ్చాడు. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఏటీఎం కేంద్రం వద్దకు వెళ్లి డబ్బులు తీసుకోవడానికి ప్రయత్నిస్తుండగా గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి తాను డబ్బులు తీసిస్తానని నమ్మించి తన ఏటీఎం కార్డులను తీసుకుని డూప్లికేట్ ఏటీఎం కార్డు తన చేతిలో పెట్టి వెళ్లినట్లు చెప్పాడు. కొంత సమయానికి సెల్‌ఫోన్‌కు రూ.30 వేలు డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో వెంకటేశ్ మోసం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత రెండు రోజులుగా ఏటీఎం కేంద్రం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఇలా మోసాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసు అధికారులు పట్టణంలో నిఘా పెంచాల్సిన అవసరముందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కడా పీడీ గ్రీవెన్స్‌డే వాయిదా

కుప్పం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయంలోని సమావేశ మందిరంలో ఈనెల 11న సోమవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు విషయాన్ని గమనించాలని కోరారు.

16, 17 తేదీల్లో రాజనాలబండలో తిరునాళ్ల

చౌడేపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో ఈనెల 16, 17న తిరునాళ్ల వైభవంగా జరుగుతుందని టీటీడీ సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని చౌడేపల్లె, పెద్దకొండామారి, ఊటూరు, గాజులవారిపల్లె, చిప్పినేపల్లె, కొలింపల్లె, గూబలవారిపల్లె, పెద్దూరు, దానరయ్యగారిపల్లె, వెంగళపల్లె తదితర గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులతో తిరునాళ్ల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్, టీడీపీ సిబ్బంది శ్రీహర్ష, గ్రామ పెద్దలు మల్లికార్జునరెడ్డి, ఈశ్వరయ్య, ప్రభాకర్, మునివెంకటరమణ, ఆలయ అర్చకులు కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరిదేవికి అలంకరణలు

చౌడేపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శనివారం స్థానిక కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని అలంకరించి వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు. కార్యక్రమంలో సరస సురేష్, డిండుకుర్తి సురేష్ కుటుంబ సభ్యులు ప్రసాదాలు అందించారు.

రాజనాలబండలో శ్రావణ శనివారం పూజలు



అలంకరణలో రాజనాలబండ ఆంజనేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి

చౌడేపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో శ్రావణమాసం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి, కొండ కింద బండపై కొలువైన ఆంజనేయ స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షించారు. స్థానిక బజారు వీధిలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు శ్రావణ మాస మూడో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బోయకొండలో శాస్త్రోక్తంగా చండీహోమం



చండీ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చౌడేపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రీతి కరమైన చండీ హోమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా ఆశీర్వాద మండపం వద్ద కలశ స్థాపన చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూల మంత్రాన్ని భక్తులచే పఠింపజేసి సహస్ర కుంకుమార్చన చేయించారు. అనంతరం చండీ హోమాన్ని భక్తులచే ఆచరింపజేశారు. అధిక సంఖ్యలో భక్తులు హోమంలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి అభిషేకం

సోమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కందూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని అమ్మవారికి అభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే ఆర్యవైశ్య సభ్యులు ఏడాదికి ఒక్కసారి శ్రావణ మాసంలో పౌర్ణమి రోజున జరుపుకునే జంజాల మార్పిడి కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు పద్మనాభశాస్త్రి శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కమనీయం... వెంకటరమణుడి కల్యాణం



వెంకటరమణస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పుంగనూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామికి శ్రవణ నక్షత్రం సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి అత్యంత వైభవంగా శ్రీవారి కల్యాణం జరిగింది. స్థానిక ఆలయంలో స్వామివారితోపాటు శ్రీదేవి భూదేవి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేసి అర్చకులు శ్రీనివాసాచార్యులు కల్యాణానికి ముస్తాబు చేశారు. శాస్త్రోక్తంగా వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవార్లకు మాంగళ్యధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు హాజరై కల్యాణోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్ స్వామికి సన్మానం



శ్రీధర్ స్వామిని సన్మానిస్తున్న సామాజిక సేవా కార్యకర్త

గంగవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కీలపట్లలో గత ఏడేళ్లుగా నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న శ్రీధర్ స్వామిని శనివారం పలమనేరుకు చెందిన సామాజిక సేవా కార్యకర్త మదన్ మోహన్‌రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం కీలపట్ల ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు వచ్చి కోనేటిరాయ స్వామి వారిని దర్శించుకుంటున్నారన్నారు. దూర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులతో పాటు స్థానికంగా వచ్చే భక్తులకు గత ఏడేళ్లుగా దాతల సహకారంతో నిర్విరామంగా అన్నదానం నిర్వహిస్తూ, భక్తుల కడుపునింపుతున్న శ్రీధర్ స్వామి వారి సేవలు అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో చంద్ర, వేణు, నారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబుతో ఆదివాసుల జీవితాల్లో వెలుగులు



కుప్పంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న రాజ్‌కుమార్, ఆదివాసుల నాయకులు



రామకుప్పంలో జరిగిన ఆదివాసీ దినోత్సవ సభలో మాట్లాడుతున్న మునిరత్నం

కుప్పం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆదివాసుల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు, కడా సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పంలో శనివారం ప్రపంచ ఆదివాసుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివాసుల సంఘం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆదివాసుల కాలనీలు, వారి నివాస ప్రాంతాలలో టీడీపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అన్నిరకాల మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ప్రత్యేక పథకాలు తీసుకొచ్చి ఆదివాసుల జీవన ప్రమాణాలు పెంచడమే కాక, వారి ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగు పరచడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తుందన్నారు. ఆదివాసుల సంఘం నాయకులు, నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన ఆదివాసులు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** టీడీపీ అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో శనివారం రామకుప్పం పట్టణంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణ వీధుల్లో భారీ ర్యాలీ చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజలాపురం ఆటోస్టాండు సర్కిల్‌లో నిర్వహించిన సభలో ఏపీఎస్‌ఆర్టీసీ మాజీ వైస్‌చైర్మన్ మునిరత్నం మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసీల సంక్షేమం కోసం టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి ఎంతో కృషి చేసిందని తెలిపారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీఆంజనేయరెడ్డి, ఎస్టీసెల్ జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణానాయక్, కామరాజనాయక్, మాజీ జడ్పీటీసీ సాంబశివం, నేతలు రామ్మూర్తి, గంట్లప్పగౌడు, జయశంకర్, సత్తి, వెంకటాచలం, సలాంసాబ్, రామకృష్ణప్ప, మహ్మద్ రఫీ, అవినాశ్, నాగభూషణం, జేయి, రవినాయక్, వెంకటరమణ రామలింగారెడ్డి, రవిరెడ్డి, గజేంద్ర, సుబ్రీ, పద్మమ్మ, అల్లీశీన, రఘు, భూపతి, సురేష్, మునిరాజనాయక్, చంద్రబాబునాయక్, సుధాకర్‌నాయక్, మునీంద్రనాయక్, రామూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరపి లేని వర్షం



సోమల : పెద్దఉప్పరపల్లె - చౌడేపల్లి మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న సీతమ్మ చెరువు వంక

సోమల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ పరిధిలో శనివారం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు కురిసిన భారీ వర్షానికి సోమల-పెద్దఉప్పరపల్లె మార్గంలోని ప్రధాన రోడ్డులో రాంపల్లె వద్ద రాకపోకలు స్తంభించిపోయాయి. దేవళకుప్పం, రాంపల్లె, రామకృష్ణాపురం, బయ్యారెడ్డిపల్లె తదితర చోట్ల భారీ వర్షంతో వర్షపు నీరు రోడ్డుపై పొంగి ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అలాగే చౌడేపల్లె - పెద్దఉప్పరపల్లె రోడ్డు మార్గంలోని సీతమ్మ చెరువు వంక ఉధృతితో పలు గ్రామాల ప్రజల రాకపోకలు ఆగిపోయాయి. పలమనేరు, పుంగనూరు టమోటా మార్కెట్లకు వాహనాల్లో వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ప్రాజెక్టుకు చేరుతున్న వర్షపు నీరు

● **సదుం:** రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలోని తిమ్మానాయునిపల్లె పంచాయతీ కొర్లగుంటవారిపల్లె సమీపంలోని సాగునీటి ప్రాజక్టులోకి వర్షను నీరు జోరుగా చేరుతోంది. ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాలైన చౌడేపల్లె, సోమల మండలాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు చిన్నపాటి కుంటలు, చెరువులు నిండి మొరవలు పోతుండటంతో ఇప్పటికే సుమారు 70 శాతం ప్రాజెక్టు నిండింది. ఆదివారం వర్షం కురిస్తే పూర్తి స్థాయిలో ప్రాజెక్టు నిండే అవకాశం ఉందని స్థానిక రైతులు అభిప్రాయ పడుతున్నారు.

● **గంగవరం:** పలమనేరు, గంగవరం మండలాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 నుంచి 7 గంటల వరకు భారీ వర్షం కురవడంతో పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలమనేరు, గంగవరం మండలాల పరిధిలోని పలు చెరువులకు నీరు పుష్కలంగా చేరుతుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నీట మునిగిన కాలీఫ్లవర్

● **పుంగనూరు రూరల్ :** మండలంలోని చదళ్ల గ్రామ సమీపంలో వర్షానికి కాలీఫ్లవర్ పంట నీట మునిగింది. చదళ్ల గ్రామానికి చెందిన చంద్రారెడ్డి దాదాపు రెండు ఎకరాల పొలంలో కాలీఫ్లవర్ పంటను సాగు చేశారు. అయితే గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో నీరు నిలిచి పంట పూర్తిగా దెబ్బతింది. పంట కోసం పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



వెంకన్న అలంకరణలో దర్శనమిస్తున్న శనేశ్వరస్వామి



బైరెడ్డిపల్లెలో విశేషాలంకరణలో శేషాద్రిస్వామి

పుంగనూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఉపవాసాలతో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. స్థానిక కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి వారిని శ్రావణ మాస శనివారం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకాలు చేశారు. విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే పట్టణ సమీపంలోని పుంగమ్మచెరువు, దండుపాళ్యం మార్గంలో వెలసిన శనేశ్వరస్వామి ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లెలోని శేషాద్రి స్వామి ఆలయంలో శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తిప్పయ్యాచార్యులు శ్రీదేవి భూదేవి సమేత శేషాద్రిస్వామికి అభిషేకం చేసి విశేషాలంకరణతో పూజలు జరిపారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శేషాద్రిస్వామి ఆలయ సేవకుడు ధనంజయగౌడు ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదానం చేశారు. అలాగే పట్నపల్లె కల్యాణ వెంకటరమణ స్వామి ఆలయం, కడపనత్తం నలగుండ్రాయస్వామి ఆలయం, కార్వేటికొండ ధ్యానాభిరామస్వామి ఆలయం, మురారిపల్లె ఓబులేశ్వరస్వామి ఆలయం, బైరెడ్డిపల్లె కోదండరామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేంద్రబాలాజీ

బైరెడ్డిపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాల అగ్రహారం గ్రామంలో శనివారం సీజనల్ వ్యాధుల నివారణపై బైరెడ్డిపల్లె ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, వైద్యాధికారి విజయచందర్ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వర్షాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున కాచిచల్లార్చిన నీటిని వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధుల బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, సూపర్‌వైజర్లు రెడ్డెమ్మ, రాజారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ అశ్విని, ఆశాకార్యకర్తలు జమున, అనిత తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు



ప్రజలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

కల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నేరాల నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు కొత్త కాలనీలో శనివారం ఉదయం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సుమారు 100 ఇళ్లల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. రికార్డులు సరిగా లేని 4 ద్విచక్రవాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలపై అనుచితంగా మాట్లాడటం నేరమని, అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని తెలిపారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఈ రాజేశ్వరి

రొంపిచెర్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు వైద్యపరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని హెచ్‌ఈ రాజేశ్వరి అన్నారు. శనివారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి వినయ్ వైద్యపరీక్షలు నిర్వహించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేసుకోవాలని, అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. కాన్పు సమయంలో 108 వాహన సేవలు వినియోగించుకోవాలన్నారు. రక్తహీనతతో కలిగే సమస్యలు.. తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో అమ్మని, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు బైరెడ్డిపల్లెలో ఉచిత కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 10న ఆదివారం ఉదయం 9 గంటలకు మానసక్లినిక్, పున్నమి బేకరి సహకారంతో చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రి వైద్యులచే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యనిపుణులు కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేస్తారన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



రొంపిచెర్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : బొమ్మయ్యగారిపల్లె గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గంగవరం వైసీపీ యూత్ అధ్యక్షుడిగా కిశోర్ నాయుడు

గంగవరం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండల వైసీపీ యూత్ అధ్యక్షులుగా కిషోర్ నాయుడును ఎంపిక చేసినట్లు ఆ పార్టీ మండలాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి తెలిపారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా భారతిరెడ్డి, రైతు విభాగం అధ్యక్షులుగా వేణుగోపాల్ రెడ్డి, బీసీసెల్ అధ్యక్షులుగా టి.ప్రభాకర్, ఎస్సీసెల్ అధ్యక్షులుగా బద్రీనాథ్, ఎస్టీసెల్ అధ్యక్షురాలిగా గంగులమ్మ, మైనార్టీ అధ్యక్షులుగా రెహమాన్‌తో పాటు పలు విభాగాల అధ్యక్షులను మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ సూచనల మేరకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

మాణిక్య వరదరాజస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

పుంగనూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పుంగమ్మ చెరువు వద్ద వెలసిన మాణిక్య వరదరాజస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ధర్మకర్తల మండలి నియామకానికి ఆసక్తి కలిగిన వారు ఈనెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను చిత్తూరు చర్చి వీధిలోని జీవకారుణ్య అన్నదానసత్రంలోని జిల్లా దేవదాయశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వైభవంగా సత్యనారాయణస్వామి వ్రతం



సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న వరదరాజస్వామి ఆలయంలో శనివారం సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తుల చేత వైభవంగా నిర్వహింపజేశారు. అనంతరం వరదరాజస్వామికి ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే.. చిత్తడే



గుంతలమయమైన నక్కలపాళ్యం రోడ్డు

గుడిపాల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కొద్దిపాటి వర్షానికి మట్టి రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మండలంలోని పేయనపల్లె చెరువు నుంచి నక్కలపాళ్యంకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ఎక్కడ పల్లం.. ఎక్కడమిట్టో తెలియక ద్విచక్ర వాహనదారులు పడిలేచి వెళుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టడమో లేదా నూతనంగా రోడ్డు వేయాలని గత ప్రభుత్వంలో మొరపెట్టుకున్నా ఇంత వరకు పట్టించుకోవడం లేదు. వర్షం కురిసినప్పుడల్లా గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో గట్రాళ్లమిట్ట, గురుగునత్తం గ్రామాలకు వెళ్లే రోడ్లలో కూడా వర్షపు నీరు నిలవడంతో తీవ్ర అవస్థలుపడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

ఉద్యోగులకిచ్చిన హామీల అమలు ఏమైంది..?



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీయూ అధ్యక్షుడు గంటా మోహన్

నగరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు ఇచ్చిన హామీల అమలు ఏమైందని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షులు గంటా మోహన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నగరిలో శనివారం జరిగిన ఎస్టీయూ డివిజన్‌స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సకాలంలో డీఏలు ఇస్తామని, మెరుగైన వేతన సవరణ చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వానికి గుర్తు చేశారు. పలు రకాల యాప్‌ల పేరుతో టీచర్లు బోధనేతర పనులు చేస్తూ ఒత్తిడికి గురై అవస్థలు పడుతున్నారని జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి సర్వీసు నిబంధనల అమలుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్టీయూ నాయకులు నాగభూషణం, బొబ్బిలిరెడ్డి, లక్ష్మీనారాయణ, పురుషోత్తం, మోహన్, సుబ్రమణ్యం పిళ్లై, గుణశేఖర్, అమర్‌నాథ్, వెంకట్, వసంత్, వేణు తదితరులు పాల్గొన్నారు.

జగన్ క్షమాపణ చెప్పాలి: టీడీపీ



దశరథవాసు

నిండ్ర, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల జగన్మోహన్‌రెడ్డి మానవత్వం మరచి, తన కాన్వాయ్ ఢీకొని వృద్ధ దళితుడు సింగయ్యను ప్రాణాలు కోల్పోయేలా చేసి, ఆ విషాద ఘటనను దాచిపెట్టేందుకు చేసిన కుప్పిగంతులు, వైసీపీ చేసిన రాజకీయాన్ని రాష్ట్ర ప్రజలందరూ కళ్లారా చూశారని టీడీపీ నాయకుడు దశరథవాసు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మా కార్యకర్తని మేమే చంపుకున్నా ఏమైంది అని నిస్సిగ్గుగా మాట్లాడడం, దళితుల ప్రాణాలకు, గౌరవానికి వైసీపీ ఎంత విలువ ఇస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇదే ధోరణి నిన్న తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి అనుచరులు అనిల్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, మరో ముగ్గురు కలసి ఒక దళిత యువకుడిని రూమ్‌లో బంధించి క్రూరంగా దాడి చేశారని, స్పృహ కోల్పోయే అమానుషంగా దాడి చేయడమేగాక అతన్ని కొడుతున్నప్పుడు వీడియోలు చిత్రీకరించి, బాధిత తండ్రికి పంపి పైశాచిక ఆనందం పొందారని వాపోయారు. జగన్మోహన్‌రెడ్డి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని, నిజంగా దళితులపై ఆయనకు చిత్తశుద్ధి ఉంటే దాడులు చేసిన వైసీపీ నేతలను, రౌడీలను వెంటనే పార్టీనుంచి బహిష్కరించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల సంరక్షణకు కూటమి ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు.

త్రీమెన్ కమిటీ చైర్మన్, మెంబర్లకు సన్మానం



గంగాధరనెల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండల సింగిల్‌విండో సొసైటీ త్రీమెన్ కమిటీ అధ్యక్షుడిగా ఎల్లాపల్లెకు చెందిన ముప్పిరి మోహన్ నాయుడు, సభ్యులైన నరాల కండ్రిగకు చెందిన బుర్రా జ్యోతియాదవ్, మిట్ట దళితవాడకు చెందిన ఇమ్మానువేల్ (చిన్నా)ను నియమించిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా శనివారం వారికి శాలువలు కప్పి, స్వీట్‌బాక్స్‌లను అందజేసి పలువురు నేతలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేతలు మోహన్‌రెడ్డి, పురుషోత్తంనాయుడు, ప్రభాకర్‌నాయుడు, కామసాని కోదండరెడ్డి, మునిరాజులుయాదవ్, నెల్లేపల్లె సుబ్రమణ్యం, మునిరత్నంనాయుడు, దేవరాజులు, ఇరసయ్య, మురగయ్య, వెంకటేష్, భాస్కర్, షణ్ముగం, దాము, షడక్‌లు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ



సుపరిపాలన తొలిఅడుగు కరపత్రాలను పంచుతున్న టీడీపీ నాయకులు

నగరి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో ముందుకు నడిపించగలిగే సత్తా సీఎం చంద్రబాబుకే ఉందని నగరి పట్టణ టీడీపీ నాయకులు పేర్కొన్నారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో శనివారం సుపరిపాలన తొలిఅడుగు కరపత్రాలను యూనిట్ ఇన్‌ఛార్జ్ గుణశేఖర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సూపర్‌సిక్స్ పథకాల అమలుతీరును వివరించారు. కార్యక్రమంలో గుణశేఖర్, మదన్‌కుమార్, అశోక్‌రాయల్, కుమారస్వామి, శివకుమార్, గోపి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయం

గుడిపాల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ చెప్పారు. శనివారం మండలంలోని గట్రాళ్లమిట్ట పంచాయతీలో ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈనెల 15న మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు.

హరోం..హర...

● తిరుత్తణికి కావళ్లతో తరలిన ముంగరమడుగు గ్రామస్తులు



మొక్కులు తీర్చుకోవడానికి తిరుత్తణికి వెళుతున్న భక్తులు

బంగారుపాళ్యం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరుడికి మొక్కులు తీర్చుకోవడానికి ముంగరమడుగు గ్రామస్తులు కావళ్లతో శనివారం వెళ్లారు. ఈ సందర్భంగా ముంగరమడుగులో ఉదయాన్నే భక్తులు బావుల వద్దకు చేరుకుని స్నానాలు ఆచరించి సుబ్రహ్మణ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం కావళ్లను అలంకరించి వీధుల్లో పంబల మేళతాళాల మధ్య హరోం హరా.. అంటూ కుటుంబ సమేతంగా తమ మొక్కులు తీర్చుకోవడానికి తమిళనాడులోని తిరుత్తణికి బయలుదేరారు. గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు జ్ఞాపిక, రశీదు అందిస్తున్న బాలాజీ నాయుడు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 9(ఆంధ్ర జ్యోతి): కాణిపాక క్షేత్రంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన సూర్యచంద్ర శనివారం రూ. 1,00,116 విరాళంగా అందించారు. విరాళదాత, వారి కుటుంబ సభ్యులను ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా సుదర్శన హోమం



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

తవణంపల్లె, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి మేళ తాళాల నడుమ ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



సోదరుడికి రాఖీ కడుతున్న సోదరి

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో అన్ని వర్గాల ప్రజలు కుల మతాలకతీతంగా రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిరకాలం తమ వెన్నంటి ఉండి కష్టసుఖాల్లో తమకు అండదండగా ఉండాలని, ఆయురోగ్యాలతో జీవించాలని కోరుతూ సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి నోరు తీపి చేసి ఆశీర్వాదాలు పొందారు. నగరంలోని రాజస్థాన్, హర్యానా, పంజాబీలతో పాటు ఇతర ఉత్తర హిందూస్థానీయులతో ఆంధ్ర, తమిళ, కన్నడీయులు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా రాఖీలు కట్టించుకున్న సోదరులు తమ సోదరీమణులకు విలువైన కానుకలు అందజేసి వారిలో ఆత్మస్థైర్యం నింపారు.

విద్యార్థులకు జాతీయ స్థాయి తెలుగు భాషా పోటీలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): త్వరలో నిర్వహించనున్న తెలుగు భాషాదినోత్సవ వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు జాతీయస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుగు సాహితీ సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షులు తులసినాథం నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు - అమృత భాష అనే అంశంపై రెండు పేజీలు మించని వ్యాసం రాసి పంపాలని ఆయన కోరారు. అభ్యర్థులు తమ వ్యాసాలను ఈ నెల 20వ తేదిలోపు పి.తులసినాథం నాయుడు, కళామందిరం, గంగవరం, పలమనేరు - 517408 అనే చిరునామాకు కేవలం పోస్టల్ ద్వారానే పంపాలని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఏకధాటిగా 100 తెలుగు పద్యాలు ఆలపించే విద్యార్థులు తమ పేర్లను 93462 49011కు తెలియజేసి నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

టీడీపీ అంతర్గత సమావేశం

వెదురుకుప్పం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ముఖ్య టీడీపీ నాయకులు శనివారం కార్వేటినగరంలో ఆ పార్టీ అధ్యక్షులు చెంగల్రాయయాదవ్ అధ్యక్షతన సమావేశమయ్యారు. మండల టీడీపీ అనుబంధ కమిటీలైన బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ, రైతు, మండల యువత, మహిళా కమిటీలపై చర్చించారు. త్వరితగతిన ఈ కమిటీల నియామకం పూర్తి చేయాలని చర్చించుకున్నారు.

వరసిద్ధుడి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందా ఆమె కుటుంబ సభ్యులతో కలసి శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వారిని సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాస నారాయణి సేవ

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో శనివారం మాస నారాయణి సేవను భక్తులు నిర్వహించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిత్తూరు ప్రభుత్వాస్పత్రి, గాంధీ సర్కిల్, దర్గా సర్కిల్, లెప్రసీ కాలనీ తదితర ప్రాంతాల్లో పేదలకు భోజన పొట్లాలు, తాగునీరు పంపిణీ చేశారు. మధుసూదనం, ప్రభాకర్ నాయుడు, సత్యనారాయణ, పాండురంగం, శ్రీకంఠయ్య, గజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజగోపురానికి భూమిపూజ

నిండ్ర, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నిండ్రలో టీటీడీ నిధులతో నిర్మించనున్న ప్రసన్న వెంకటేశ్వర ఆలయ రాజగోపుర పనులకు భూమిపూజ ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. నిండ్రలో శ్రీకృష్ణదేవరాయలకాలంలో నిర్మించిన పురాతన ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోగా, టీటీడీ సహకారంతో రూ.కోటి 70 లక్షలతో తిరిగి నిర్మించారు. ప్రస్తుతం రాజగోపురం, ప్రహరి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

విడవని వర్షం... ముదురుతున్న రోగాలు

● ఆస్పత్రుల నిండా రోగులు




నగరంలో శనివారం కురుస్తున్న వర్షం

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నగరంలో గత నాలుగు రోజులుగా ప్రతి రోజు సాయంత్రం చిరు జల్లులతో ప్రారంభమై ఓ మోస్తరు వర్షాలు పడుతున్నాయి. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. మురుగుకాల్వల్లోని మురుగు నీరు రోడ్లపై ప్రవహించడంతో దుర్వాసనతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు నగరపాలక పరిధిలో అన్నీ డివిజన్లలో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యారు. ఆస్పత్రులకు రోగులు పోటెత్తారు. జ్వరాలు, దగ్గులు, ఇతర అంటువ్యాధులతో తీవ్ర అవస్థల పాలవుతున్నారు. ఈవర్షాలు మరో నాలుగు రోజులపాటు ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక ఆరోగ్యశాఖ అధికారులు తెలియజేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, సాధ్యమైనంత వరకు కాచిన నీటిని తాగాలని సూచించారు.

బంగారుపాళ్యంలో భారీ వర్షం

● పొంగిపొర్లిన వంకలు, వాగులు



గౌనిచెరువు నుంచి బలిజపల్లె చెరువుకు ప్రవహిస్తున్న నీరు



బంగారుపాళ్యంలో రోడ్డుపై పారుతున్న నీరు

బంగారుపాళ్యం, ఆగస్టు 9(ఆంధ్ర జ్యోతి): బంగారుపాళ్యం మండల కేంద్రంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండలంలోని మొగిలిలోని గౌనిచెరువు, మొగిలివారిపల్లె కామాక్షమ్మచెరువు, బలిజపల్లె చెరువు, టేకుమంద చిరువాడి చెరువు, గన్నేరి చెరువు, ముంగరమడుగులోని వెంకటప్పనాయిని చెరువుకు నీరు చేరుతోంది. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వంకలు సాగుతున్నాయి. శనివారం సాయంత్రం 4 గంటల నుంచి సుమారు 5.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. శనివారం సంతకావడంతో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రంలో రోడ్డుపై నీరు నిలిచిపోగా వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.

హీరో మహేష్ అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న మహేష్‌బాబు అభిమానులు

చిత్తూరు రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలో సినీ హీరో సూపర్‌స్టార్ మహేష్‌బాబు జన్మదిన వేడుకలు అభిమాన సంఘ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. మహేష్‌బాబు అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు కేపీ శ్రీధర్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి సుమారు 50 మంది అభిమానులు రక్తదానం చేశారు. మధ్యాహ్నం ఎంఎస్‌ఆర్ సర్కిల్ వద్ద పేదలకు అన్నదానం చేశారు. అనంతరం పెనుమూరు మండలం శాతంబాకంలో ఐదేళ్ల క్రితం మహేష్‌బాబు ఫౌండేషన్ ద్వారా గుండెకు సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకున్న చిన్నారి భైరవ సింధు కుటుంబ సభ్యులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. 'అతడు' సినిమా రీరిలీజ్ సందర్భంగా శ్రీవెంకటేశ్వర థియేటర్ వద్ద అభిమానులు కేక్ కట్‌చేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు రవికుమార్, కొంబు, రావూరి రవి, ప్రతాప్, దీనా, మోహన్, శరవణ, ప్రేమ్, రాజా, ముని తదితరులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో...



హాస్టల్ విద్యార్థినులకు విద్యాసామగ్రిని పంపిణీచేస్తున్న లోకనాథం

గంగాధరనెల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీహీరో మహేష్‌బాబుకు పుట్టినరోజు వేడుకలను మహేష్, కృష్ణ ఫ్యాన్స్ జిల్లా నేత లోకనాథం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గంగాధరనెల్లూరు బస్టాప్ కూడలిలో అభిమానులు కేక్‌కట్‌చేసి ఒకరుకొకరు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. అనంతరం వారు స్థానిక హాస్టల్లో పలువురు విద్యార్థినులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా నేతలు కొంబు రాజేంద్రన్, మోహన్, రాజా, ప్రేమ్, మండల ఫ్యాన్స్ యూనియన్ నేతలు క్రిష్ణన్, హరిక్రిష్ణారెడ్డి, నక్షత్రం, హరిబాబు, డిల్లీకుమార్, నీరజాక్షులు, మోహన్, మదన్, మహేష్, శేఖర్, సురేష్, సుదీర్, వెంకటేష్ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో గాయపడ్డ మురుగేష్‌కు సాయం



మురుగేష్‌కు ఆర్థికసాయాన్ని అందిస్తున్న జీఆర్ కన్‌స్ట్రక్షన్ సిబ్బంది

బంగారుపాళ్యం, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ పద్మావతినగర్‌కు చెందిన దొరైరాజ్, బుజ్జమ్మల కుమారుడు మురుగేష్ గత జూన్ నెల 3వ తేదీ రాత్రి కొత్తపల్లె ఫ్లైవోవర్ వద్ద ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో మురుగేష్ కుడిచేతిని కోల్పోయాడు. కాళ్ళు, చేతులు పనిచేయకపోవడంతో తల్లిదండ్రులే మురుగేష్‌కు సపర్యలు చేస్తున్నారు. మేస్త్రీపనులు చేస్తూ కుటుంబాన్ని పోషించే మురుగేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. తల్లిదండ్రులు వృద్ధులు కావడంతో కుటుంబం మొత్తం మురుగేష్ మీదే ఆధారపడేది. వైద్య ఖర్చులకు కూడా డబ్బులు లేకపోవడంతో ఈ విషయాన్ని బొమ్మాయిపల్లెకి చెందిన జీఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఈశ్వర్ నాయుడికి గ్రామస్తులు తెలియపరచగా, శనివారం జీఆర్ కన్‌స్ట్రక్షన్ మేనేజర్ కృష్ణమూర్తి, సిబ్బంది బుజ్జి నాయుడు, నరేష్ నాయుడులు మురుగేష్ ఇంటికి వెళ్లి రూ.25 వేల ఆర్థికసాయాన్ని అందించారు.

కిచెన్ కిట్ల పంపిణీ



గుడిపాల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా విడవని వర్షంతో అవస్థలు ఎదుర్కొంటున్న మండలంలోని పెరుమాల కుప్పం ఎస్టీ కాలనీ వాసులకు శనివారం మండల రెడ్‌క్రాస్ ప్రతినిధులు కిచెన్ కిట్లు, టార్పాలీయన్ పట్టలు పంపిణీ చేశారు. వారు 8 గిరిజన కుటుంబాలకు వీటిని అందజేశారు. మరో 25 కుటుంబాలకు కూడా త్వరలోనే అందజేస్తామని, మండలంలో రెడ్ క్రాస్ సేవలను మరింతగా విస్తరింపచేస్తామని కార్యదర్శి ప్రభుదాస్, సభ్యుడు గురు తెలియజేశారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



తవణంపల్లె, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన 35 మంది గర్భిణులకు మండల వైద్యాధికారి ప్రియాంక పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని అరగొండ అపోలో సంపూర్ణ ఆరోగ్యం ఆధ్వర్యంలో గర్భిణులకు పండ్లు, పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అపోలో సంపూర్ణ ఆరోగ్యం ఏవో ప్రేమానంద్, జనరల్ మేనేజర్ అరుణ్ గంగాధర్, డాక్టర్ గాయత్రి, సీహెచ్‌వోలు జ్ఞానశేఖర్, రాజమణి, పీహెచ్ఎన్ జీవకళ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన గోడ.. తప్పిన ప్రమాదం



ముత్తువాళ్లపూరులో కూలిన ఇల్లు

గుడిపాల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాల పంచాయతీ ముత్తువాళ్లపూరుకు చెందిన అల్లావుద్దీన్ ఇంటి గోడ ముసురువానకు బాగా నానింది. దాంతో శుక్రవారం రాత్రి బయటపక్కకు వాలిపోయింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అల్లావుద్దీన్ తెలిపారు.

వంట పాత్రల వితరణ



వంట పాత్రలు విరాళంగా అందిస్తున్న నాగరాజు నాయుడు

ఐరాల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలకలసంతగేటులో వెలసిన కాలభైరవేశ్వరస్వామి ఆలయానికి శనివారం ప్రసాదం తయారీకి వంట పాత్రలను బత్తల నాగరాజు నాయుడు వితరణ చేశారు. ఆయన కుమారుడు బత్తల ముఖేష్, మనుమడు బత్తల లిశాన్ కృష్ణ చౌదరిల పుట్టినరోజు సందర్భంగా రూ.50,000 విలువ చేసే వంట పాత్రలను సత్యం స్వామికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పొలకల పంచాయతీ ఉపసర్పంచ్ బత్తల సురేంద్ర నాయుడు, బి.నరసింహులు నాయుడు, వేణు నాయుడు, రవి నాయుడు, బీటీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సుద్ధగుంటలో పౌర్ణమి పూజలు



వెదురుకుప్పం, ఆగస్టు 9(ఆంధ్ర జ్యోతి): కార్వేటినగరం సమీపంలోని సుద్ధగుంట్లో వెలసి ఉన్న ఆదిపరాశక్తి రేణుక మాత అమ్మవారి ఆలయంలో శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులను దర్శనానికి అనుమతించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ నిర్వాహకులు ఉసురుపాటి పద్మనాభం పర్యవేక్షించారు.

ఆత్మలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం సమీపంలో పల్లేరుకాయ కోనలో వెలసిన ఆత్మలింగేశ్వరస్వామికి పౌర్ణమి సందర్భంగా శనివారం భగవతి, రాకేష్, దంపతులు హోమం, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త మోహన్ నాయుడు, వేమ నాయుడు, జ్యోతిప్రకాష్, మోహన్‌బాబు, రాజా పాల్గొన్నారు.

బాలగురునాథీశ్వర ఆలయంలో...

పాలసముద్రం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీబొమ్మరాజపురంలో ఉన్న బాలగురునాదీశ్వరస్వామి ఆలయంలో అర్చకస్వాములు రెండు కలశాలను ఏర్పాటుచేసి గణపతి హోమం, రుద్రహోమం నిర్వహించారు. అనంతరం కలశ జలంతో అమ్మవారికి బాలగురునాదీశ్వరస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ పూజలను తిలకించడానికి బెంగుళూరు, తమిళనాడు నుంచి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

దుప్పట్ల పంపిణీ



యాచకులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పార్థసారథినాయుడు

చిత్తూరు రూరల్, ఆగస్టు 9(ఆంధ్ర జ్యోతి): నగరంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఆలయాలు, బస్టాండుల్లో, నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులు, యాచకులు చలికి వణికి పోయారు. వారి కష్టాన్ని గుర్తించిన నగరానికి చెందిన మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు శనివారం దుప్పట్లు పంచిపెట్టారు.

రేపటి నుంచి కుంభాభిషేకం పూజలు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవెంకటాపురం పంచాయతీ గరిగెలపల్లెలో నూతనంగా నిర్మించిన గణపతి దక్షిణమూర్తి మహాలక్ష్మీ విద్యాసరస్వతి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు మహాకుంభాభిషేకం పూజలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. 11వతేది సోమవారం భగవత్ ప్రార్థన, యమునాపూజ, గోపూజ, యాగశాల ప్రవేశం, మహాగణపతి, సహస్రాదీపారాధన, అంకురార్పణం, కలశస్థాపన, 12వతేది మంగళవారం వేదపారాయణం, మహాగణపతి సహస్రమోదక హోమం, నవగ్రహ పూజ, మహామంగళహారతి, అష్టబంధనం, దీపారాధన, 13వతేది బుధవారం కలశారాధన, ప్రధాన దేవతారాధన, గోదర్శనం, మహాకుంభాభిషేకం, అష్టదిక్పాలకుల ఆహ్వానం, మంగళహారతి పూజలతో ముగియనున్నట్లు చెప్పారు. ప్రతిరోజు భక్తులకు అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

నులిపురుగుల నిర్మూలనపై ర్యాలీ

విజయపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నిర్మూలనపై మండల కేంద్రమైన విజయపురంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈనెల 12న నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కల్పించారు. నులిపురుగు మాత్రలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి విష్ణుప్రియ కోరారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వన వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): దేవరగుడిపల్లె - ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. ఏర్పాట్లను ఆలయ ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్ పర్యవేక్షించారు.